
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు డీవీఎస్ రావు, ప్రతిమ దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.




పురాతన పెన్నిధి తొలి తిరుపతి

పెద్దాపురం మండలంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం తొలి తిరుపతిలో శృంగార వల్లభ స్వామి కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి.

8లో

డెల్టా కాలువలకు 10 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

విద్య, విజ్ఞానార్జనలో విద్యార్థులు



యానాం బొటానికల్ గార్డెన్ గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు

ముమ్మిడివరం: విద్యా, విజ్ఞాన అభివృద్ధికి దోహదపడేలా మూడు రోజుల విశాఖ విద్యాయాత్రను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ యాత్రలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు పాల్గొని చక్కని అనుభూతిని పొందారు. యానాం బొటానికల్ గార్డెన్‌లో మొక్కల రకాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పొందిన విద్యార్థులు జిప్‌మెర్ మెడికల్ విశ్వ విద్యాలయంలో వైద్య విద్య అవకాశాలపై అవగాహన పొందారు. ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమలో విద్యార్థులు చెక్క బొమ్మల తయారీ, మెషినరీ, సంప్రదాయ కళారూపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విశాఖలో రుషి కొండ బీచ్, తొట్లకొండ బౌద్ధారామాలు, రామానాయుడు స్టుడియో, భీమిలి బీచ్, హిల్ వ్యూపాయింట్ తదితర అంశాలను అధ్యయనం చేశారు. అలాగే నావెల్ మ్యూజియం, సబ్‌మెరీన్ మ్యూజియం, టీ–142 యుద్ధ విమానం మ్యూజియం సందర్శించి భారత రక్షణ రంగంలోని విశిష్టతలను గుర్తించారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, విశాఖ నగర మున్సిపల్ కమిషనర్ విశ్వనాథంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఈ యాత్ర విజయవంతానికి కృషి చేశారు. ఈ యాత్రలో జిల్లా సైన్సు అధికారి గిరిజాల వీఎస్ సుబ్రహ్మణ్యం, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఉపాధ్యాయ బృందం పాత్ర ఎనలేనిది. ఈ యాత్రపై సమగ్ర నివేదికను త్వరలో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అందజేయనున్నట్టు డీఈఓ తెలిపారు.

రామాలయానికి వెండి కిరీటాలు



సీతారాముల వారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిటీ సభ్యులు

మండపేట: పట్టణంలోని 14వ వార్డు శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభమైన రామాలయానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి వెండి కిరీటాలు బహూకరించి తన భక్తిని చాటారు. ఆలయంలోని వినాయకుడు, లక్ష్మీదేవిలకు సుమారు లక్ష రూపాయల విలువైన వెండి కిరీటాలను సమర్పించారు. శ్రీరామ నవమి నాడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె దేవతామూర్తులకు కిరీటాలను అలంకరించారు. అనంతరం రాముల వారి కల్యాణ వేడుకల్లో పాల్గొని పానకాన్ని స్వీకరించారు. ప్రజలంతా సీతారాముల వారి అనుగ్రహంతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పెంకే గంగాధరం, నాయకులు తాడి రామారావు, శెట్టి నాగేశ్వరరావు, సూరంపూడి సత్యప్రసాద్, పిఠాపురం సత్యనారాయణ, శెట్టిబలిజ సంఘం నాయకులు, మహిళలు, కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలవాడా.. వేంకటేశుడా..



శ్రీవేంకటేశ్వర స్వామివారు

- కోనసీమ తిరుమలగా **ఖ్యాతికెక్కిన క్షేత్రం**
- నాటి నౌకాపురి.. నేడు **వాడపల్లిగా ప్రసిద్ధి**
- గోదావరిలో అర్చా**మూర్తిగా లభ్యమై** ఏడువారాల గోవిం**దుడిగా కీర్తి**
- ఇంత నుంచి నభో**వీధంత ఎదిగిన తేజం**
- నేటి నుంచి స్వామి **వారి కల్యాణోత్సవాలు**

కొత్తపేట: తిరుమల–తిరుపతి పెద్ద తిరుపతిగా.. ద్వారకా తిరుమల చిన తిరుపతిగా.. అదే వరుసలో అత్యంత భక్త జనాదరణ పొందిన పుణ్య క్షేత్రం వాడపల్లి. గౌతమీ–వశిష్ట గోదావరి నదుల నడుమ, గౌతమీ నదికి అతి సమీపంలో అందమైన పచ్చని పొలాల మధ్య వేంకటేశుడు వెలసిన గ్రామం వాడపల్లి. దీనికి కొద్ది దూరంలోనే విజ్జేశ్వరం సమీపంలో మరో వాడపల్లి ఉన్నందున, లొల్ల గ్రామానికి ఆనుకొని ఉండటంతో లొల్ల వాడపల్లి, చిన్న వాడపల్లిగా పిలుస్తారు. ఏడు వారాల వెంకన్న దర్శనం – ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడి, విశ్వాసం బాగా ఏర్పడడంతో ప్రతి శనివారం భక్తులు అత్యధిక సంఖ్యలో ఏడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. దానితో పదేళ్లలోనే ఈస్వామి ఇంతింతయై వటుడింతయై నభోవీధిపైనింతై.. అన్నట్టు విరాట్‌రూపంగా విరాజిల్లుతున్నాడు. దీంతో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల జాబితాలోకి ఈ క్షేత్రం కూడా చేరింది. కోనసీమ ప్రాంతంలో ఉన్నందున కోనసీమ తిరుమలగా, రాష్ట్రంలో మూడో తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. అనాదిగా ఈ క్షేత్రంలో చైత్రశుద్ధ దశమి నుంచి చైత్రశుద్ధ బహుళ పాడ్యమి వరకూ వారం రోజుల పాటు శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని దివ్య కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ దేవదాయ – ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

వాడపల్లి క్షేత్ర స్థల పురాణం

ఈ క్షేత్రంలో ఉన్నది దారుమూర్తి. నల్లని చెక్కపై మలిచిన ఈ విగ్రహం చూసేందుకు శిలలాగే ఉంటుంది. ఇక్కడి శిలా ఫలకం ఆధారంగా ఈ క్షేత్ర చరిత్రను పరిశీలిస్తే.. వైకుంఠంలోని నారాయణుని దర్శనానికి వచ్చిన సనక సనందాది మహర్షులు భూలోకంలో పెరిగిపోతున్న పాపం, అధర్మం, అన్యాయాలను తగ్గించే మార్గం చూపమని వేడుకున్నారు. అప్పుడు శ్రీమహావిష్ణువు వారితో అధర్మం ప్రబలినపుడు అర్చా స్వరూపుడనై గౌతమీ ప్రవాహ మార్గంలో నౌకాపురం అనే ప్రదేశంలో వెలుస్తానని మాట ఇచ్చాడు. అన్న మాట ప్రకారం లక్ష్మీదేవితో వచ్చిన స్వామివారు ఈ విషయాలను నారదుని ద్వారా ప్రజలకు తెలియజేయమని వివరించాడు. సుమారు 400 సంవత్సరాల క్రితం గౌతమీ నదీ తీరాన వున్న నౌకాపురి తరువాత ఓడపల్లిగా తరువాతి కాలంలో వాడపల్లిగా నామాంతరం చెంది రుషులతో తపోవనంగా విరాజిల్లేది. ఆ కాలంలో దండకారణ్యంగా పిలవబడే ఈ ప్రాంతంలో స్వయంభువుగా రక్తచందనంతో స్వామివారు ఇక్కడ మూర్తీభవించారు. గోదావరి నదిలో స్వామి వారి విగ్రహం ఉన్నట్టు భక్తులకు కలలో చెప్పి ఆవిర్భవించినట్లు మరో కథ ప్రచారంలో ఉంది. ఆ విగ్రహన్ని రుషులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆగమ శాస్త్రం ప్రకారం విగ్రహం లభించిన ప్రాంతంలో ఏటి ఒడ్డున ప్రతిష్ఠించారు. దేవర్షి నారదుడు సైతం ఈ ప్రతిష్ఠలో పాల్గొన్నట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది.

550 ఎకరాల విరాళం

పినపోతు గజేంద్రుడు అనే సంపన్న వ్యాపారి 1759వ సంవత్సరంలో వాడపల్లి క్షేత్రంలో వేంకటేశ్వరునికి ఆలయాన్ని నిర్మించారు. గజేంద్రుడికి స్నేహితుడు, ప్రాంతీయ పరిపాలకుడైన పెద్దాపురం మహరాజు రాజా వత్సవాయి తిమ్మ జగపతిరాజు అప్పట్లో స్వామివారి ఆలయ నిర్వహణకు 275 ఎకారాల భూమిని విరాళంగా సమకూర్చారు. దీప ధూప నైవేద్యాల కోసం 110 ఎకరాలు, స్వామి వారి సేవల నిమిత్తం 165 ఎకరాలను సమర్పించారు. ఈ భూములను అర్చక మాన్యాలు, మాదశి మాన్యం, రజక, మంగలి, సన్నాయి, ధూపదీప నైవేద్యం మాన్యాల కింద స్వామి వారికి సర్వ హక్కులు కల్పించారు. ఆ భూములపై వచ్చే ఆదాయంతో వీరంతా జీవనం సాగిస్తూ స్వామి వారికి సేవలు అందించేలా చేయడంతో స్వామివారి షోడసోపచారాలు నిరాటంకంగా సాగిపోతున్నాయి.



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

ఏడు వారాల దర్శనంతో

స్వయం భూ వేంకటేశ్వరుని ఆలయాలను దేవదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్న అనంతరం కొంతకాలం పాటు సేవలు అంతంత మాత్రంగానే సాగాయి. ఇటీవలి కాలంలో కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెంది ఏడు శనివారాలు వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలంగా నమ్మిన భక్తులు విశేషంగా వచ్చి స్వామిని దర్శిస్తున్నారు. అలాగే దేవస్థానం ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ప్రతి శనివారం సుమారు రూ.50 లక్షలు పైబడి ఆదాయం వస్తుండగా, ప్రతి నెలా హుండీల ద్వారా సుమారు రూ.1.35 కోట్లు పైబడి ఆదాయం సమకూరుతోంది. దానితో ఆలయం డిప్యూటీ కమిషనర్ స్థాయికి చేరింది.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల వ్యయంతో ఈ క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అవరణలో గోశాల, భారీ రేకు షెడ్లు, అన్నదాన భవన నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేశారు. రూ.55 కోట్లుతో ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. రూ 5.5 కోట్లతో వకుళమాత అన్న ప్రసాద భవనం ఏర్పాటు చేస్తున్నారు. రూ 2.5 కోట్లతో స్వామి వారి తెప్పోత్సవం నిర్వహణకు తిరుమల దేవస్థానం తరహాలో కోనేరు ఏర్పాటు చేస్తున్నారు. కాలినడకన వచ్చే భక్తులకు విశ్రాంతి, సామూహిక వివాహలు, ఉపనయనాలు జరిపేందుకు వీలుగా రూ.కోట్లతో మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. రూ.65 లక్షలతో స్వామి వారికి శాశ్వత వార్షిక కల్యాణ వేదిక, మరుగుదొడ్లు, బస్సు షెల్టర్ నిర్మాణం, రూ.22 లక్షలతో తాగునీటి వాటర్ ప్లాంట్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటుచేశారు. తాజాగా ఉచిత, వివిధ రుసుముల దర్శనానికి సంబంధించి క్యూలైన్లు పెంచారు. ఫ్లై ఓవర్ ఏర్పాటుచేశారు. రావులపాలెం, బొబ్బర్లంక నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దారి పొడవునా వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు అన్న ప్రసాదం అందిస్తున్నారు.

కల్యాణోత్సవాలు ఇలా..

- **సోమవారం అంకురార్పణ**, ధ్వజారోహణం
- **మంగళవారం కల్యాణం**, తీర్థం, రథోత్సవం
- **9న పొన్నవాహనంపై** గ్రామోత్సవం
- **10న మహదాశీర్వచనం**, సదస్యం
- **11న గోదావరిలో తెప్పో**త్సవం
- **12న మహ పూర్ణాహుతి**, చక్రస్నానం
- **13న స్వామి వారి పుష్పో**త్సవం

అన్ని ఏర్పాట్లు చేశాం



గత కల్యాణోత్సవాలకు మించి **భక్తుల సంఖ్య పెరుగుతుందనే అంచనాలతో** ఏర్పాట్లు **చేశాం. ఆ మేరకు జిల్లా** కలెక్టర్ **మహేష్‌కుమార్** పర్యవేక్షణలో అన్ని **ప్రభుత్వ శాఖల అధికారులతో** సమీక్షలు **నిర్వహించాం. వారందరి** సమన్వయంతో ముందుకు **వెళ్తున్నాం. స్వామి** వారి తీర్థ, కల్యాణ **మహోత్సవాల్లో భక్తులకు** ఏ విధమైన అసౌకర్యలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– నల్లం సూర్యచక్రధరరావు, దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ, వాడపల్లి

నేటి నుంచి వార్షిక పరీక్షలు

రాయవరం: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటిగా ఆరు నుంచి 9 తరగతులకు సోమవారం నుంచి, తొమ్మితో తేదీ నుంచి ఒకటి నుంచి ఐదు తరగతులకు సెల్ఫ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా ఇప్పటికే గత నెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షల అనంతరం ఈ నెల 24 నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

మే 7 నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ఆదివారం కల్యాణోత్సవాల వాల్ పోస్టర్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఆవిష్కరించారు. మే 7 నుంచి 13వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తారు. 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి దివ్య కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

ఏకపక్ష నిర్ణయాల్లో శభాష్!

- ఆశావహులను కాదని అయినవారికి పదవులు
- అటు తెలుగు తమ్ముళ్లు.. ఇటు సైనికుల అసంతృప్తి
- అధిష్టానాలకు లేఖాస్త్రాలు సంధిస్తున్న వైనం

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వంలో మొదలైన పదవుల పందేరంలో నియోజకవర్గ అమాత్యుడు తీసుకుంటున్న నిర్ణయాలు మిత్ర పక్షం జనసేనకు మింగుడుపడడం లేదు. ఎన్నికల అనంతరం జనసేన వల్లనే గెలిచానని చెప్పుకొచ్చిన మంత్రి సుభాష్ పదవుల పంపకం వచ్చేసరికి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని జనసేన నేతలు మథన పడుతున్నారు. తాజాగా కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ ట్రస్ట్ చైర్మన్, అగస్త్యేశ్వరస్వామివారి ఆలయ కమిటీ చైర్మన్ ఎంపిక సిఫార్సుల్లో మంత్రి నిర్ణయంతో జనసేనకు ఎదురు దెబ్బ తగిలిందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే టీడీపీలో సీనియర్ నేతలను సైతం పక్కన పెట్టి అసలు ఏం జరుగుతుందో తెలియకుండా అంతా మంత్రి, ఆయన తండ్రి నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎక్కడో ఉండి వచ్చిన వారిని అందలాలు ఎక్కించడం వెనుక మర్మమేమిటని సీనియర్ టీడీపీ నేతలు అధిష్టానానికి రాసిన లేఖలు కలకలం సృష్టిస్తున్నాయి. పట్టణంతో పాటుగా రామచంద్రపురం పరిసర ప్రాంతాలకు ప్రతిష్టాత్మకమైన కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ ట్రస్ట్ చైర్మన్ పదవిని జనసేన నేతలు పట్టణానికి చెందిన ఒక ప్రముఖ వైద్యునికి ఇవ్వాలని మంత్రికి సూచించినట్టు తెలిసింది. తీరా ఆ వైద్యుడిని ఒప్పించి మంత్రి వద్దకు తీసుకువెళ్లగా, ఆ పదవికి అప్పటికే తాను నిర్ణయం తీసుకున్నానని ఒక పేరును చెప్పడంతో జనసేన నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు. పట్టణంలో ఒక పాఠశాలలో కొద్ది నెలల క్రితం పదవీ విరమణ చేసిన ఒక ఉపాధ్యాయుడికి కృత్తివెంటి ట్రస్టు చైర్మన్ ఇవ్వడానికి మంత్రి నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణానికి చెందిన ఆ ప్రముఖ వైద్యుడు చైర్మన్ అయితే హుందాగా ఉండేదని జనసేన నేతలు అంటున్నారు. సదరు ఉపాధ్యాయునికి పదవి కట్టబెట్టడంపై ఏం జరిగి ఉంటుందోనని యోచిస్తున్నారు. ఇదిలా ఉండగా అగస్త్యేశ్వర స్వామివారి ఆలయ ట్రస్టు చైర్మన్ విషయం కూడా వివాదంగా మారినట్లు తెలుస్తోంది. ఆలయాల్లో పనిచేసే ఒక అర్చకునికి ఈ చైర్మన్ పదవిని ఇచ్చేందుకు సిఫార్సు చేశారని, అయితే ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు మంత్రి గెలుపు కోసం పనిచేశామని వారికి కాకుండా పదవుల పంపకంపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటంతో అటు జనసేన, ఇటు టీడీపీ క్యాడర్‌లోను తీవ్ర అసంతృప్తి రగులుతోంది.

అటకెక్కిన సమన్వయ కమిటీ

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలుత ఎవరికి వారు బాధ్యతలు తీసుకోకపోవటంతో కంగుతిన్న మంత్రి, ఆయన తండ్రి కలిసి నియోజకవర్గ, మండల, పట్టణ సమన్వయ కమిటీలను తెరపైకి తీసుకువచ్చారు. వారి ఆధ్వర్యంలోనే అన్ని పనులు జరుగుతాయని నమ్మబలికారు. చివరికి ఎన్నికలు ముగిసిన అనంతరం ఆయా సమన్వయ కమిటీలను అటకెక్కించిన వైనం కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో అటు టీడీపీ, ఇటు జనసేనలో సీనియర్ నేతలు మంత్రి, ఆయన తండ్రి తీసుకుంటున్న నిర్ణయాలపై ఎదురవుతున్న వ్యతిరేకతను ఎప్పటికప్పుడు వారి అధిష్ఠానానికి లేఖల ద్వారా చేరవేస్తున్నట్టు తెలుస్తోంది.



కృత్తివెంటి కళాశాల

మన భద్రాద్రిలో.. మహావైభవంగా..

పుత్రునిగా, సోదరునిగా, భర్తగా, మిత్రునిగా, సేవకునిగా, ప్రభువుగా ఎన్నో ఆదర్శాలను ఆచరించి చూపించిన మహనీయుడు ఆయన. మూర్తీభవించిన ధర్మమూర్తి. గుండెల నిండా కారుణ్యాన్ని నింపుకొన్న దయామూర్తి. శరణన్నవారికి అభయప్రదాత. ఆనందాన్ని పంచే పట్టాభిషేక సమాచారాన్ని.. ఆందోళన కలిగించే వనవాసాన్ని సమానంగా స్వీకరించిన స్థితప్రజ్ఞుడు. సమస్త సుగుణాలను రాశిగా పోస్తే అదే ఆయన రూపం. ఆ సకల సుగుణాభిరాముడు అయిన రామచంద్రమూర్తి.. సీతమ్మవారిని మనువాడిన అపురూప సన్నివేశాన్ని తిలకించి.. భక్తజనకోటి ఆనందంతో పులకించింది.

పెదపూడి: బుగ్గన చుక్కతో, పట్టుపుట్టాలు ధరించి, సర్వాభరణభూషితురాలై, నునుసిగ్గులు ఒలకబోస్తూ సీతమ్మ తల్లి.. సమస్త ఆభరణాలూ అలంకరించుకుని, నూతన వస్త్రాల్లో మెరిసిపోతూ రామయ్య తండ్రి.. వధూవరులుగా పెళ్లి పీటలపై కొలువుదీరిన వేళ.. వారి కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించిన భక్తులు ఆనంద పరవశులే అయ్యారు. వేద పండితులు సుస్వరంగా మంత్రాలు చదువుతూండగా.. మంగళ వాయిద్య ఘోష, భక్తుల 'జై శ్రీరామ్' నామస్మరణలు నలుదిశలా ప్రతిధ్వనిస్తూండగా.. కాకినాడ జిల్లా పెదపూడి మండలంలో.. రెండో భద్రాద్రిగా ఖ్యాతికెక్కిన గొల్లల మామిడాడ గ్రామంలో కోదండరాముని కల్యాణోత్సవం..

- కన్నుల పండువగా కోదండ రాముని కల్యాణం
- భక్తజనసంద్రమైన గొల్లల మామిడాడ వేలాదిగా తరలివచ్చిన భక్తులు



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

శ్రీరామ నవమి పర్వదినమైన ఆదివారం కన్నుల పండువగా జరిగింది.

కల్యాణోత్సవం జరిగిందిలా..

ఆలయ అర్చకులు, వేద పండితులు కోదండ రాముని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు స్వామి, అమ్మవారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సీతారాములకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, పలువురు భక్తులు తలంబ్రాలుగా మంచి ముత్యాలు సమర్పించారు. 11.45 గంటలకు ఆలయ ధర్మకర్త ఇంటి నుంచి మంచి ముత్యాలు, తలంబ్రాలు, 9 రకాల పండ్లు, పుష్పాలు, పట్టు వస్త్రాలను పల్లకిలో ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పండితులు కల్యాణోత్సవ సంకల్పం ప్రారంభించారు. లోకకల్యాణ కారకమైన సీతారాముల కల్యాణ క్రతువుకు ఎటువంటి విఘ్నాలూ రాకూడదని ప్రార్థిస్తూ తొలుత విష్వక్సేన పూజ నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం వధూవరులకు మధ్యాహ్నం 2.08 గంటలకు రక్షాబంధనం కట్టారు. 'యజ్ఞోపవీతం పరమం పవిత్రం' అంటూ మంత్రాలు పఠిస్తూ కోదండ రామచంద్రునికి 2.20 గంటలకు యజ్ఞోపవీత ధారణ గావించారు. అనంతరం వధూవరులకు పూలమాలలు అలంకరించారు. 'ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ..' అనే శ్లోకం చదువుతూ మిథిలాధిపతి జనక మహారాజు తరపున అర్చకులు సీతమ్మ వారిని రామచంద్రమూర్తికి కన్యాదానం చేశారు. మధ్యాహ్నం 3.03 గంటల సుముహూర్తానికి వధూవరుల శిరస్సులపై జీలకర్ర – బెల్లం ఉంచారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించి, హారతి ఇచ్చారు. కోదండ రామచంద్రమూర్తి చేతులకు అర్చకులు మాంగల్య సూత్రాన్ని తాకించి, సీతమ్మ వారి మెడలో అలంకరించారు. అనంతరం మంచి ముత్యాలతో తలంబ్రాలు పోసి, వేడుక నిర్వహించారు.



కోదండ రాముని దర్శనానికి ఆలయం బయట బారులు తీరిన భక్తులు



కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులు



పట్టు వస్త్రాలు తీసుకుని వస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దంపతులు

వెల్లువెత్తిన భక్తులు

రామయ్య తండ్రి కల్యాణాన్ని కన్నులారా తిలకించేందుకు గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని కోనేరులో పలువురు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీరామ నవమి నాడు ఇక్కడ ఆనవాయితీగా సాగే పిల్లల వేలంపాట తంతు యథావిధిగా జరిగింది. ఇక్కడి కోదండరాముని కల్యాణ తలంబ్రాలు వేసుకున్న వారికి కొద్ది కాలంలోనే వివాహం జరుగుతుందని, ముందు రోజు ఆలయానికి చేరి, నిద్రించే వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈమేరకు పలువురు ముందురోజే ఆలయానికి చేరుకున్నారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు మంచి ముత్యాలతో కూడిన తలంబ్రాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై కె.రామారావుతో పాటు తొమ్మిది మంది ఎస్సైలు, 110 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మృతుడు సునీల్

సీతానగరం: గృహ హింస చట్టం కింద నమోదైన కేసులు నడుస్తుండగా మరో బంధం ఉండకూడదన్న తన మరదలి మాటకు మనస్తాపం చెంది ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోగల శ్రీరామనగరంలో రాజుగారి కళ్యాణ మండపంలోని గదిలో రామచంద్రపురానికి చెందిన వేమగిరి సునీల్ (26) ఆదివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అతడి తల్లి శాంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెదురుపాకకు చెందిన వరుసకు మరదలైన మహిళ హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రైవేట్ బస్‌లో సీతానగరం వచ్చి తన బావ సునీల్‌కు ఫోన్ చేసింది. అతడు ఉదయం 9 గంటలకు రాజు గారి గార్డెన్‌కు చేరుకున్నాడు. అప్పటికే వివాహమైన సునీల్‌కు తన భార్యతో మనస్పర్థలు రావడంతో అతనిపై 498 (ఎ) కేసు నమోదైంది. అలాగే అతడు ఆరు నెలల క్రితం తన ఇంటికి వచ్చి దాడి చేసినట్టు అతని భార్య ఇచ్చిన మరో ఫిర్యాదు పైనా కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో అతడు తన మరదలిని తనతో ఉండిపొమ్మని ఒత్తిడి తెచ్చాడు. దీంతో గృహ హింస కేసులు కోర్టులో నడుస్తుండగా అతడితో ఉండకూడదని నచ్చచెప్పింది. ఇంతలో సాయంత్రం 4 గంటలకు ఆ మహిళ స్నానం చేయడానికి బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి సునీల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సునీల్‌ను ఆమె ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ నుంచి సీతానగరం పీహెచ్‌సీకి తరలించి, రామచంద్రపురంలోని సునీల్ బంధువులకు సమాచారం అందించింది. పీహెచ్‌సీకి మృతుని బంధువులు రాగానే ఆమె వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటికే సునీల్ మృతి చెందినట్లు నిర్ధారించినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలిక కిడ్నాప్ కలకలం

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణంలో కొంకాపల్లికి చెందిన బాలిక కిడ్నాప్ కలకలం సృష్టించింది. మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల తన కుమార్తెను గుర్తు తెలియని వ్యక్తులు కారులో కిడ్నాప్ చేసినట్లు బాలిక తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా ఈ కిడ్నాప్ జరిగిందని, అమలాపురం శుభ కలశం సెంటర్ వద్ద ట్రాఫిక్‌లో కారు చిక్కుకోవడంతో అందులోని వ్యక్తి చేతిని కొరికి కిందికి దిగిపోయినట్టు బాలిక తెలిపింది. సీఐ వీరబాబు దర్యాప్తు చేస్తున్నారు.

పురాతన పెన్నిధి
తొలి తిరుపతి


స్వయంభువుగా వెలిసిన తిరుపతి శృంగార వల్లభుడు


పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి ఆలయం ఇదే. (అంతర చిత్రం) స్తంభాలపై ఉన్న పురాతన చారిత్రక ఆనవాళ్లు

- 9 వేల ఏళ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం
- ప్రాశస్త్యాన్ని ధ్రువీకరిస్తున్న పురాణాలు, శాసనాలు
- రేపు శృంగార వల్లభుని వార్షిక దివ్య కల్యాణం

పెద్దాపురం: దివ్యమంగళం గోవిందుని **రూపం.** వేయి నామాల వాడ వేంకటేశుడా అన్నట్టు **ఎక్కడ** ఏ పేరుతో వెలసినా ఇది ఆది.. ఇది తుది **అని చెప్ప**లేనిది స్వామివారి కీర్తి. ఇదంతా ఎం**దుకంటే..** తిరుమల తిరుపతి వేంకటేశుడి కంటే **ముందే** వెలసిన దేవాలయంగా ఖ్యాతి గడించిన స్వామి ఇక్కడి మూర్తి. తొమ్మిది వేల ఏళ్ల కిందట స్వయంసిద్ధ క్షేత్రంగా పెద్దాపురం మండలం తొలి తిరుపతిలో శ్రీ, భూ సమేత శృంగార వల్లభ స్వామిగా వెలిశారన్నది ఇక్కడి స్థల పురాణం.

వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఊరి గురించి నేటి తరం వారికి తెలియకపోవచ్చు. కానీ 'తొలి తిరుపతిగా' ప్రసిద్ధికెక్కిన ఆలయ చరిత్ర ఎప్పుడో తనలో పదిలంగా దాచుకుంది. సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలో పెద్దాపురం మండలం చంద్రమాపంల్లి (దివిలి) గ్రామానికి కిలో మీటరన్నర దూరంలో ఏలేరు నది ఒడ్డున ఉంది ఈ చదలాడ తొలి తిరుపతి. దీని చరిత్ర మొత్తం ఇక్కడ వెలిసిన శ్రీ, భూ సమేత శృంగార వల్లభ స్వామి ఆలయంతో ముడిపడి ఉంది. ఒక రకంగా చెప్పాలంటే ఈ అత్యంత పురాతన దేవాలయ, ఊరి చరిత్రలు ప్రముఖ పుణ్య క్షేత్రాలైన సింహాచలం 8 వేల ఏళ్లు, తిరుమల తిరుపతికి 6700 ఏళ్ల కంటే ప్రాచీనమైనదని చెప్తారు. **ఈ 'తొలి తిరుపతిగా' చరిత్ర మాత్రం తొమ్మిది వేల సంవత్సరాలు నాటిది.** ఈ విషయాన్ని 'చాతావళి' అనే సంస్కృత గ్రంథంలో లిఖించబడి ఉంది. ఇదే విషయాన్ని పురావస్తు శాఖ తమ పరిశోధనల్లో కనుగొనడం గమనార్హం. దేశవ్యాప్తంగా మొత్తం 108 తిరుపతులు ఉండగా వాటిలో 'తొలి తిరుపతి'దే తొలిస్థానం. సింహాచలం, పెద్ద తిరుపతి, యాదగిరి గుట్ట వంటి ప్రముఖ దేవాలయాలు మిగిలిన వరుసలో ఉంటాయి.

విశిష్ట నిర్మాణ శైలి

ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి చూస్తే 12 కాళ్ల ప్రధాన మండపం. 52 అడుగుల ధ్వజస్తంభం, సభా మండపం, అంతరాలయం, గర్భాలయం ఉంటాయి. ఈ ఆలయం మాదిరిగానే పెద్ద తిరుపతి (తిరుమల తిరుపతి) కూడా ఏడు ద్వారాలు ఉండడం విశేషం. ఆలయంలో మొత్తం 34 స్తంభాలు ఉంటే కేవలం రెండు స్తంభాలు మాత్రం ఒకేలా ఉంటాయి. సభా మండపంలోకి అడుగుపెట్టే ముందు నేలపై నిర్మించిన పద్మం దానినే చూస్తూ మరో పద్మం ఉండేది. కానీ దీనిలో అంతరార్థమేదో ఉందని కింది పద్మగర్భంలో నిధి, నిక్షేపాలుంటాయని చాలా ఏళ్ల కిందట దొంగలు తవ్వి పాడుచేశారు.

ఎడమ చేతిలో చక్రం.. కుడి చేతిలో శంఖం

ఇక్కడ స్వామి ముఖం చిరు మందహాసంతో ఉంటుంది. స్వామి వక్షస్థలంపై లక్ష్మీదేవి స్థిర నివాసం ఉండడం, ఇతర స్వాముల విగ్రహాలకు భిన్నంగా ఎడమ చేతిలో చక్రం, కుడి చేతిలో శంఖం ఉండడం విశేషం. ఇక స్వామి చేతుల్లో 12 సూర్యుల తేజస్సుకు సమానమైన తామర పుష్పం భాసిస్తుంది. ఈ తరహా పుష్పం తిరుమలలోని వెంకటేశ్వరుని చేతిలోనూ, సింహాచలం నరసింహ స్వామి చేతిలోనూ ఉన్నట్లు చెబుతారు.

మహా క్షేత్రంగా వృద్ధి

ఇక ఆలయ వివరాల్లోకి వెళ్తితే ఇది మూడు క్షేత్రాల మహాక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా ఇది స్వయం సిద్ధక్షేత్రం. నారద మునీంద్రుడు ఇక్కడ లక్ష్మీదేవిని ప్రతిష్ఠించడంతో దివ్యక్షేత్రం కాగా శ్రీ కృష్ణ దేవరాయలచే గోదాదేవి ప్రతిష్ఠ జరగడంతో రాజక్షేత్రంగా వెరసి మహా క్షేతంగా మారింది.

ప్రముఖులు దర్శించిన ఆనవాళ్లు

చారిత్రక కోణం పరిశీలిస్తే భోజ మహారాజు ఈ ఆలయానికి సున్నం వేయించినట్టు, విక్రమార్కుడు సందర్శించినట్లు ఆధారాలున్నాయి. అలాగే చత్రపతి శివాజీ, విక్టోరియా మహారాణి సైతం ఆలయ దర్శనానికి వచ్చినట్లు శాసనాల్లో ఉందని ఆలయ ప్రధాన పూజారులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు వివరిస్తున్నారు.

ఆస్తి కర్పూరం

చక్రవర్తులు, సామంతుల కాలంలోనే వందలాది ఎకరాల ఆస్తి అన్యాక్రాంతమై, నేటికి 18 ఎకరాలు మాత్రమే మిగిలింది. వేల సంవత్సరాలు కిందట ఆలయ నిర్మాణం కావడంతో ప్రస్తుతం ఆలయం పూర్తి జీర్ణావస్థలో ఉంది. దశాబ్ద కాలం కిందట ఢిల్లీ నుంచి వచ్చిన బృందంలో ఒక వృద్ధ పండితుడు దేవ నాగరి లిపిలోని శాసనాలను అధ్యయనం చేసి అయ్యప్ప అనే మౌర్య చక్రవర్తి పండిద్రాశ్వార్లను ప్రతిష్ఠించినట్లు ధ్రువీకరించారు. ఇంతటి ఘన చరిత్ర కల్గిన ఆ ఆలయంపై పురావస్తు శాఖ దృష్టి సారించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది.

టీటీడీ సహకారంతో ఆలయ అభివృద్ధి

తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో తిరుపతి శృంగార వల్లభుని ఆలయం అభివృద్ధి చెందుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ అభివృద్ధికి సుమారు రూ.రెండు కోట్లు మంజూరు చేయడం, దాతల సహకారంతో కల్యాణ మండపం, ఆలయం లోపల అన్నదాన సత్రం షెడ్లు, పచ్చని మొక్కల పెంపకంతో పాటు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతీ శనివారం భక్త జాతరే

స్వామి వారికి ప్రీతికరమైన ప్రతి శనివారం భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తుతారు. కిలో మీటర్ల మేర భక్తులు బారులు తీరి స్వామికి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి పాదయాత్రగా ఏడు వారాలు మొక్కు తీర్చుకుంటే అనుకున్న కోరికలు తీరుతున్నాయన్న నమ్మకంతో వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు.

భక్తుల ఎత్తులోనే కనిపించే స్వామి

తనను దర్శించుకునే భక్తుల ఎత్తులోనే శృంగార వల్లభుడు కనబడతారని చెబుతారు. దీనికి సంబంధించి ఆసక్తికరమైన కథ ఉంది. సవతి తల్లి వల్ల అవమానాలపాలై తండ్రి ప్రేమకు నోచుకోని ధ్రువుడు మహా విష్ణువు కోసం తపస్సు చేశాడు. ఆ బాలుడి తపస్సుకు మెచ్చి దర్శనమిచ్చిన స్వామి రూపాన్ని చూసి ధ్రువుడు భయపడ్డాడు. చేతిలో ఉన్న శంఖు, చక్రాలను మార్చుకుని బాలుడి స్థాయికి వచ్చి చెక్కిళ్లు పట్టి విష్ణువు దగ్గరికి తీసుకున్నాడని కథనం. అప్పటి నుంచి శృంగార వల్లభ స్వామి తనను దర్శించే వారిలో ఎత్తులో కనిపిస్తారని ప్రతీతి.

బొడ్నబావి ప్రత్యేకత

ఆలయానికి ఆగ్నేయ మూలంలో చతురస్రాకారంలో ఉన్న బావిని బొడ్నబావిగా పిలుస్తుంటారు. నేలబావిగా ఉన్న ఈ బావి చుట్టూ రాళ్లు పేర్చి నిర్మించడం వింత గొలుపుతుంది. కార్తిక మాసంలో ఈ బావి నీటితోనే స్నానం చేస్తే సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. కార్తిక పౌర్ణమి నాడయితే మరింత ప్రాశస్త్యమని భక్తుల నమ్మిక. అది కూడా ఆలయ అర్చకుల చేతుల మీదుగా నీరు తోడించుకుని స్నానం చేస్తుంటారు. మిగిలిన చైత్రం, శ్రావణం, ధనుర్మాసాల్లో భక్తులే స్వయంగా స్నానం చేస్తారు. ఈ బావి నీటిని చుట్టు పక్కల గ్రామాల వారు సీసాలతో ఇంటికి తీసుకువెళ్లి మామూలు నీళ్లతో ఈ నీటిని కలిపి స్నానం చేస్తారు.


బొడ్నబావి వద్ద విశిష్టతను తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ. (అంతర చిత్రం) ఆలయంలో పురాతన రాళ్లతో నిర్మించిన బొడ్న బావి

రేపు దివ్య కల్యాణం



స్వయంభూ శృంగార వల్లభ స్వామి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సోమవారం నుంచి కల్యాణ ఉత్సవాలు ప్రారంభించగా మంగళవారం సాయంత్రం పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ, మండపారాధన, రాత్రి 8 గంటలకు దేవేరులతో స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించనున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కల్యాణానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. తొమ్మిదిన గ్రామోత్సవం, పదిన సదస్యం, 11న విశేషార్చన సుదర్శన హోమం, చోరసంవాదము, 12వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామి వారికి చక్ర స్నానం, బుక్కా పండుగ, సామూహిక కుంకుమ పూజలు, 13వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి శ్రీ పుష్పయాగం, ఉయ్యాల సేవ ఉంటాయి. – **వడ్డి శ్రీనివాస్**, ఈఓ, తిరుపతి, పెద్దాపురం మండలం

పిచ్చుక వారింట బ్రహ్మాండ నాయకుని కల్యాణం

కాకినాడ రూరల్: ఆ ఇంట రాములోరి కల్యాణానికి శతాబ్దం చరిత్ర ఉంది. శ్రీరామ నవమి వచ్చిందంటే ఆ ఇంట కల్యాణ భజంత్రీలు మోగాల్సిందే. మూడు తరాలుగా ఏటా కల్యాణాలు నిర్వహించడం విశేషమే మరి. మండలంలోని రమణయ్యపేట ఆంజనేయనగర్‌కు చెందిన పిచ్చుక కుటుంబం ఘనత ఇది. పిచ్చుక వీర నాగేశ్వరరావు, వీర భానుమతి దంపతులు తమ నివాసంలో ఆదివారం 109వ సీతారాములు కల్యాణాన్ని బంధు మిత్రులతో కలసి ఘనంగా నిర్వహించారు. వీర నాగేశ్వరరావు తాత నాగేశ్వరరావు, నాన్నమ్మ సూరమ్మ దంపతులు 11 దశాబ్దాల క్రితం ఈ కల్యాణోత్సవాలను ప్రారంభించారు. తరువాతి తరం పద్మావతి, వీర్రాజు దంపతులు 50 ఏళ్ల పాటు నిర్వహించగా, వీర నాగేశ్వరరావు దంపతులు ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పుష్కర కాలం శ్రమించి శ్రీరామ కోటి పూర్తి చేసి 2017లో భద్రాద్రి రామునికి అంకితం చేశామన్నారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వీరనాగేశ్వరరావు దంపతులు

రామచిలకమ్మ కల్యాణం!

పిఠాపురం: రామయ్యతో కల్యాణంలోనూ సీతమ్మకు పోటీ తప్పలేదు. ఆకాశమంత పందిరిలో.. భూదేవంత పీటపై కూర్చుని రాముని మోహన రూపాన్ని మదిలోనే వీక్షిస్తూ కల్యాణ ఘడియ కోసం వేయి కళ్లతో నిరీక్షిస్తున్న తరుణం అది. అదిగో ఆ రూపాన్ని చూసే ఎక్కడి నుంచి వచ్చిందో ఎర్రని దొండపండులాంటి ముక్కుతో.. పచ్చని చీర కట్టుకుని రివ్వున వచ్చి వయ్యారంగా అక్కడా ఇక్కడా అని కాదు.. ఏకంగా రామయ్య తలపైనే వెళ్లి కూచుంది శివయ్యకు గంగలా. ఎరుపెక్కిన కన్నులతో సీత ఒక్కసారిగా దానివంక చూసింది దిగమన్నట్టు. అబ్బే.. దిగనేదిగను. నేను నీకంటే ముందే నాపేరుకు ముందు నా రాముడి పేరు తగిలించుకున్నా అని పట్టినట్టు మొహం తిప్పేసుకుంది. తప్పేదేముంది.. సరేలే ఇలా వచ్చి అలా వెళ్లేదానితో గొడవెందుకని సీతామాత సరిపెట్టుకుని కల్యాణానికి సిద్ధమైపోయింది. కల్యాణం జరిగినంత సేపూ ఆతిథ్యం స్వీకరించి ఆనక ఎటో తుర్రున ఎగిరిపోయింది. పిఠాపురం చిట్టోడి తోటలో ఆదివారం విద్యా గణపతి శ్రీ కోదండరామ ఆలయంలో రాములోరి కల్యాణోత్సవంలోని సందడి ఇదంతా. 2016 సంవత్సరంలోనూ ఇలానే జరిగిందని అక్కడి భక్తజనం గుర్తుచేసుకున్నారు.


రాముడి విగ్రహంపై వాలిన రామచిలుక

నరికినా నాదే గెలపు!

కాజులూరు: తల నరికినా జీవితంలో ఒరగను. నాదే గెలుపంటోంది ఈ అరటి. సాధారణంగా అరటి గెల తొడిమెల మధ్య నుంచి చిగురించి చిరు గెల వేసి పెరిగి పెద్దదై బరువెక్కి నేలచూపులు చూస్తుంది. కానీ కాజులూరు మండలం మొగలిపాలెంలో ఓ రైతు పొలంలోని అరటిచెట్టు మోదుభాగం నుంచే గెల వేసి ఆకాశాన్ని చూస్తూ పెరిగి పక్వానికి వచ్చింది. గ్రామానికి చెందిన తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి తన పొలంలోని కాలువగట్టుపై నాటిన అరటి చెట్లలో కొన్నింటిని దారికి అడ్డంగా ఉన్నాయని నరికేశారు. వాటిలో ఒక చెట్టు నరికేసిన మోదు నుంచి మూడు ఆకులు తొడిగి ఐదు అత్తనాలతో చిన్న గెల వేసింది. చెట్టు నరికివేసే సమయానికే పొత్తు చివరి భాగానికి వచ్చిందని వేరు వ్యవస్థ బలంగా ఉండటంతో మోదుభాగం నుంచే ఆకులు తొడిగి గెల బయటకు వచ్చిందని రైతు చెప్తున్నారు.


మొగలిపాలెంలో అబ్బుర పరుస్తున్న అరటిగెల

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు


ఉత్సాహంగా దౌడు తీస్తున్న ఎడ్ల బళ్లు


బహుమతి అందుకుంటున్న విజేత

తొండంగి: శ్రీరామ నవమి పండగను పురస్కరించుకుని మండలంలోని వేమవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పంపాది అమ్మ ఆలయ కమిటీ యూత్ ఆధ్వర్యంలో తీరప్రాంత వేమవరం తదితర గ్రామాల ప్రజల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పలు ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా తేజ చౌదరి ప్రథమ, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ద్వితీయ బహుమతి, ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో వెల్దుర్తికి చెందిన మొగిలి ఏసుబాబు ప్రథమ, దుళ్లకు చెందిన తూము శ్రీను ద్వితీయ, కొప్పవరానికి చెందిన బండారు శ్రీను తృతీయ, మద్దాల శ్రీను నాలుగో బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు నిర్వాహక కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

యువకుడి మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

- ఇసుక అక్రమాలను నిలిపివేయాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


వీడియో సందేశంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక ర్యాంపు వద్ద గోదావరి నదిలో గల్లంతైన కొత్తపేట యువకుడు దుర్గాప్రసాద్ మృతికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రమాద ఘటనపై ఆయన సామాజిక మాధ్యమాల్లో శనివారం వీడియో సందేశం ద్వారా స్పందిస్తూ ఘటనపై విచారాన్ని వ్యక్తం చేశారు. కేదారిలంకలో స్థానిక కూటమి నేతల ఇసుక దందాకు యువకుడు బలైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచితం పేరుతో కొందరు స్థానిక నాయకుడు, అధికారుల అండదండలతో యంత్రాలతో ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన గుంతలను గమనించని యువకులు వాటిలో పడి చనిపోతున్నారన్నారు. శనివారం కొత్తపేట యువకుడు దుర్గాప్రసాద్ మృతి ఘటనపై కూటమి నేతలు కుటుంబం పట్ల సానుకూలంగా స్పందించ డానికి బదులు ర్యాంపు నిర్వాహకులు నిర్వహణా పరమైన సామగ్రిని తీసుకొని పరారవడం బాధ్యతారాహిత్యమన్నారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక అని చెబుతున్నది క్షేత్ర స్థాయిలో ఏ మాత్రమూ అమలు కావడం లేదన్నారు. ట్రాక్టరు ఇసుకను రూ.1,500 చొప్పున టీడీపీ, జనసేన నాయకులు ప్రైవేటు వ్యక్తుల సాయంతో వసూలు చేస్తున్నారన్నారు. ఈ విక్రయాలపై తాను పోలీస్, మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. బాధిత కుటుంబాన్ని ఎవరు ఆదుకొంటారని ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కమనీయం.. కేశవుని కల్యాణం


ర్యాలిలో వైభవంగా సాగుతున్న జగన్మోహినీ కేశవ స్వామి వార్ల కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రమణీయంగా నిర్వహించారు. ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరుకు చెందిన వైఖానస ఆగమ శాస్త్ర పండితులు శ్రీనివాసులు వెంకటాచార్యులు పర్యవేక్షణలో శ్రీ, భూ సమేత కేశవస్వామిస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలత స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యహవాచనం, నిత్యహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో వెంకట రమణమూర్తి పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో బీవీ రమణమూర్తి ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాలువలో యువకుడి గల్లంతు


ఖాదర్ కోసం వెతుకుతున్న స్థానికులు


ఖాదర్ (ఫైల్)

రావులపాలెం: కాలువలో స్నానానికి వెళ్లిన ముగ్గురు స్నేహితుల్లో ఒకరు గల్లంతైన ఘటన గోపాలపురం బ్యాంక్ కాలువ ఆరుమామిళ్ల గట్టు రేవు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు ఈతకోట నెక్కంటి కాలనీలో నివసిస్తున్న షేక్ బాబ్జీ స్థానిక మసీదు ఇమామ్‌గా ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దవాడు జీవనోపాధికి దుబాయ్ వెళ్లాడు. రెండో కుమారుడు షేక్ ఖాదర్ (21) ఎలక్ట్రీషియన్‌గా తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతడు తన స్నేహితులైన షేక్ రజి, దేవరపల్లి బాలాజీలతో కలిసి గోపాలపురం బ్యాంక్ కాలువకు స్నానానికి వెళ్లాడు. గోపాలపురం నుంచి పొడగట్లపల్లి వచ్చే గట్టు మార్గంలో ఆరుమామిళ్ల రేవు వద్ద కొద్దిసేపు ఈత కొట్టారు. ఇంతలో ఖాదర్ గల్లంతు కావడంతో మిగిలిన ఇద్దరూ అక్కడే ఈత కొడుతున్న కొందరు యువకుల సాయంతో అక్కడ గాలించారు. ఇంతలో విషయం తెలుసుకున్న ఖాదర్ బంధువులు, ఫైర్, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని ఆదివారం రాత్రి వరకు ఖాదర్ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. ఖాదర్ మృతితో తండ్రి షేక్ బాబ్జీ, తల్లి జైనాబీ రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.